దోమల విజృంభణ.. రోగాల దరువు

- మురుగు కూపంగా బైరామల్‌గూడ చెరువు
- కాలనీల్లో పారుతున్న డ్రైనేజీ
- దోమల దండ యాత్ర
- అనారోగ్యం పాలవుతున్న చంపాపేట డివిజన్‌వాసులు


మల్‌రెడ్డి రంగారెడ్డి కాలనీలో మురుగుతో నిండిన వరదనీటి కాలువ


మురుగునీటి కాసారంగా మారిన బైరామల్‌గూడ చెరువు

చంపాపేట: ఎడ తెరిపిలేకుండా కుస్తున్న భారీ వర్షాలు.. నత్తనడకన కొనసాగుతున్న వరదనీటి కాలువల పనులు.. మురుగునీటి కూపంగా మారిన బైరామల్‌గూడ చెరువు... పూడికతీతకు నోచుకోని భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ.. వెరసి చంపాపేట డివిజన్‌లోని పలు కాలనీల్లో మురుగు పరుగుపెడుతోంది. పరిసరాలు దుర్గంధభరితంగా మారాయి... పరిసరాలు అపరిశుభ్రంగా మారడంతో దోమలు విజృంభించి ప్రజలకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి.

- చంపాపేట డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో రాత్రి పగలు అనే తేడా లేకుండా దోమలు స్వైర్య విహారం చేస్తున్నాయి. దీంతో డివిజన్‌వాసులు మలేరియా, టైఫాయిడ్, డెంగీ వంటి వ్యాధుల బారినపడి ఆసుపత్రుల పాలవుతున్నారు.
- రోజురోజుకూ మలక్‌పేట, వనస్థలిపురం ఏరియా ఆసుపత్రి, ఇతర ప్రైవేట్ ఆసుపత్రులలో పెరుగుతున్న రోగుల సంఖ్యే దీనికి నిదర్శనం. దోమల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని, సాయంత్రం సమయంలో ఫాగింగ్ చేయాల్సిన యంత్రాంగం పూర్తిగా పట్టించుకోవడం లేదని జనం ఆవేదన చెందుతున్నారు.
- డివిజన్ పరిధిలో లక్షన్నర పైగా జనాభా ఉన్నా.. ప్రజల ఆరోగ్య సంరక్షణకు సర్కిల్ అధికారులు చేపడుతున్న చర్యలు మాత్రం నామమాత్రమే అని పలు కాలనీలవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఫాగింగ్ సిబ్బందికి పలుమార్లు ఫిర్యాదు చేసినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు.

యాంటీ మలేరియా విధులు తూతూ మంత్రమే...

- డివిజన్‌లో 48 కాలనీలు, మరో 8 ఎనిమిది మురికివాడలు ఉన్నాయి. దోమలను లార్వా దశలోనే చంపేందుకు ఒక్క యూనిట్‌లో 18 మంది సిబ్బంది, ఒక సూపర్ వైజర్‌తో 2 యూనిట్లను ఏర్పాటు చేశారు.
- కాలనీలు, బస్తీలు కలిపి మొత్తం 56 ఉంటే.. 36 మంది సిబ్బందితో దోమల నివారణ ఏవిధంగా జరుగుతుందని డివిజన్ వాసులు ప్రశ్నిస్తున్నారు.
- బైరామల్‌గూడ చెరువుకు సరియైన అవుట్‌లెట్ లేకపోవడం, చెరువులోకి నేరుగా మురుగు నీరు
- చేరడంతో చెరువు కాస్తా సెప్టిక్ ట్యాంక్‌లా మారింది. కనీసం వారానికి రెండుసార్లు చెరువు నీటిపై బైటెక్స్, మలాథియాన్, లార్వా 52 లాంటి దోమలు, లార్వా నివారణ మందు పిచికారీ చేయాల్సి ఉండగా, అలాటి చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు.
- డివిజన్ పరిధిలోని మల్‌రెడ్డినగర్, మారుతీనగర్, రాజిరెడ్డినగర్, డీమార్ట్ చౌరస్తాలలో ప్రారంభించిన వరదనీటి కాలువలు నత్తనడకన సాగుతుండటంతో గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో నాలాలో మురుగు నీరు, వరదనీరు చేరి ఆయా ప్రాంతాలు దోమలకు ఆవాసాలుగా మారాయి.
- పరిసర కాలనీల్లో క్రమం తప్పకుండా ఫాగింగ్ చేస్తే తప్ప దోమల నివారణ సాధ్యం కాదు. అయితే, ఫాగింగ్ సిబ్బంది గల్లీ లీడర్లు, ప్రజాప్రతినిధుల ఇళ్ల పరిసరాల్లో అడపాదడపా ఫాగింగ్ చేస్తున్నారని, తమ కాలనీల్లో ఫాగింగ్ చేయడంలేదని చెరువు పరిసర కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి అసంపూర్తిగా ఉన్న వరదనీటి కాలువలు, బైరామల్‌గూడ చెరువు ప్రాంతాలలో దోమల నివారణ మందును పిచికారీ చేయటంతో పాటు కాలనీలలో కనీసం రెండు రోజులకు ఒకసారైనా తప్పక ఫాగింగ్ చేయాలని కాలనీల వాసులు కోరుతున్నారు.

దోమలతో ఏగలేకపోతున్నాం



మా కాలనీలో నిత్యం మురుగు పరుగు తీస్తోంది. పందులు, ఈగలు, దోమల స్వైర్యవిహారం పరిపాటిగా మారింది. వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల తరలింపునకు నోచుకోని చెత్త కుప్పలు కుళ్లిపోయి దుర్గంధం వెదజల్లుతున్నాయి. పగలు ఈగల మోత, రాత్రిళ్లు దోమల కాటుతో ఇబ్బంది పడుతున్నాం.

–ఎరవెల్లి శివకుమార్ చారి, కటకోనికుంట

క్రమం తప్పకుండా ఫాగింగ్ చేయాలి



అసలే వర్షాకాలం...గత 20 రోజుల నుంచి మా కాలనీలో దోమల నివారణకు ఫాగింగ్ చేసిన దాఖలాలు లేవు. ఒక పక్క తాగునీటి కాలుష్యం. మరోపక్క దోమకాటు. మేమిట్లనే బతకాలా. అధికారులు, ప్రజాప్రతినిధులు దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని ప్రకటనలు ఇవ్వడం తప్ప ఆచరణలో మాత్రం శూన్యం. క్రమం తప్పకుండా ఫాగింగ్ చేయాలి.

– యాదగిరి, మాధవనగర్

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సైదాబాద్: చెట్ల కొమ్మల తొలగింపు, పలు మరమ్మతు పనుల కారణంగా సోమవారం ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలోని ఈ కింది ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని డీఈ హన్మంత్‌రావు తెలిపారు.

- ఉదయం 8 నుంచి 11 గంటల వరకు.. బిలాల్ మజీద్, మాధవనగర్, సపోటాబాగ్, సంజయ్‌గాంధీ నగర్ పరిసర ప్రాంతాలు
- ఉ. 11 నుంచి మ. ఒంటి గంట వరకు... సైదాబాద్ 2ఆర్‌టీ మెయిన్ రోడ్, వెంగళ్‌రావ్ పీటీ, సైదాబాద్, రామాలయం, ఎస్‌బీహెచ్ ఆఫీసర్స్ కాలనీ, లక్ష్మీనగర్ సాయిబాబా టెంపుల్ పరిసర ప్రాంతాలు.
- మ. 3 నుంచి సా.5 గంటల వరకు... ఎల్ఐసీ కాలనీ, సైదాబాద్ ఓల్డ్ పీఎస్, వాటర్ ట్యాంక్ పరిసర ప్రాంతాలు.

రైతుబజార్లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...) టమోటా 99, వంకాయ 35, బెండ 60, పచ్చిమిర్చి 62, కాకర 55, బీర 45, క్యాలీఫ్లవర్ 23, క్యాబేజీ 17, కారెట్ 45. దొండ 18, ఆలు 23, ఉల్లి 19, గోకర 40, దోస 23, సొర 15, పొట్ల 13, అరటి 11, చిక్కుడు 65, అర్వి 40, మునగ 35, చిలగడదుంప 45, బీట్‌రూట్ 28, కీర 15, ఫ్రెంచ్ బీన్స్ 75, కాప్సికమ్ 75. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే వర్తిస్తాయి.

'నేడు డయల్ యువర్ డీఎం'

హయత్‌నగర్: హయత్‌నగర్ డిపోల పరిధిలోని ఆర్టీసీ ప్రయాణికుల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు, ప్రయాణికుల సలహాలు, సూచనలు తీసుకునేందుకు సోమవారం డయల్‌యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు హయత్‌నగర్-1 డీఎం రఘు ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 3 నుంచి 4 గంటల వరకు ఫోన్ నం: 7382800957 కు ఫోన్ చేసి నేరుగా డీఎంతో మాట్లాడి తమ సమస్యలను వివరించవచ్చని ఆయన తెలిపారు.

ఈటలకు బీజేపీ కార్పొరేటర్ల స్వాగతం


ర్యాలీలో పాల్గొన్న కార్పొరేటర్లు

నాగోలు: బీసీ సమాజ్ ఆధ్వర్యంలో నాగోల్‌లోని శుభం కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సత్కారం కార్యక్రమానికి వస్తున్న హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌కు నాగోల్ చౌరస్తాలో బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, కార్పొరేటర్లు నాయికోటి పవన్‌కుమార్, చింతల అరుణ సురేందర్ యాదవ్, రంగా నర్సింహ గుప్తా, ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి తదితరులు స్వాగతం పలికారు. అనంతరం జరిగిన ర్యాలీలో వారు పాల్గొన్నారు.

నేడు మలక్‌పేటలో ఎంపీ లక్ష్మణ్ పర్యటన

సైదాబాద్: బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ డాక్టర్ లక్ష్మణ్ సోమవారం మలక్‌పేట నియోజకవర్గంలో పర్యటిస్తారని బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం సైదాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఇటీవల కురిసిన వర్షాలకు నియోజకవర్గంలో వరద ముంపునకు గురైన చాదర్‌ఘాట్ లోయర్ బ్రిడ్జి, కాళీమాతా టెంపుల్, ఓల్డ్‌మలక్‌పేట, మూసారాంబాగ్, సైదాబాద్ తదితర ప్రాంతాల్లో డాక్టర్ లక్ష్మణ్ పర్యటించి బాధితులను పరామర్శిస్తారన్నారు. నియోజకవర్గ పరిధిలోని బీజేపీ నాయకులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

నాగోలు: గుట్టు చప్పుడు కాకుండా పేకాటాడుతున్న ఆరుగురిని ఎల్బీనగర్ ఎస్ఓటీ పోలీసులు అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ. 42,670 నగదు, మొబైల్ ఫోన్స్ స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం... ఎల్బీనగర్ సౌభాగ్యనగర్ కాలనీలో ఉండే పిన్నెంటి అనిల్‌కుమార్, ఎల్బీనగర్, వనస్థలిపురం పరిసర ప్రాంతంలో నివాసం ఉండే పెన్మెత్స నాగరాజు, యడవల్లి నాగరాజు, యడవల్లి వెంకటేశ్వర్లు, కొల్లాటి హరీష్, యడవల్లి కృపారావు కలిసి మూడు ముక్కలాట (పేకాట) ఆడుతున్నారు. సమాచారం అందుకున్న ఎస్ఓటీ పోలీసులు, ఎల్బీనగర్ పోలీసులు ఆదివారం రాత్రి అనిల్‌కుమార్ ఇంటిపై దాడి చేసి పేకాటాడుతున్న ఆరుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.42,670 నగదు, 2 సెట్లు ప్లే కార్డులు, 6 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

సంప్రదాయ నృత్యాలు దేశ సంస్కృతికి ప్రతిబింబాలు

సైదాబాద్: దేశ సంస్కృతికి ప్రతిబింబాలుగా నిలచే సంప్రదాయ నృత్యాలు దైవానికి ఎంతో ప్రీతిపాత్రమైనవని వేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ వైఎస్ఆర్ మూర్తి అన్నారు. ఐఎస్‌సదన్ డివిజన్ లక్ష్మీనగర్‌లోని ఆలయంలో శ్రీవారి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారికి నృత్య నీరాజనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రముఖ నృత్య కళాకారిణి కె.రాజేశ్వరి తమ శిష్య బృందంతో ఆలయ ప్రాంగణంలో పదార్చన నిర్వహించి ఆహూతులను ఆకట్టుకున్నారు. ప్రముఖ నాట్యాచారిణి రమణ సిద్ధి, వ్యాపారవేత్త డి.శంకర్, కమిటీ సభ్యులు ఓరుగంటి శ్రీరామచంద్రమూర్తి, వి.కనకదుర్గా, సుబ్రహ్మణ్యశాస్త్రి, భానుప్రసాద్, ప్రసాదరావు, రామానుజరావు, సాయిరామ్ పాల్గొన్నారు.

మాదిగల మరో విశ్వరూప సభను విజయవంతం చేయాలి

నాగోలు: ఎస్సీ వర్గీకరణ కోసం ఆగస్టు రెండో వారంలో జరిగే మాదిగల మరో విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని మహాజన సోషలిస్టు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు తీగల ప్రదీప్‌గౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం మహాజన సోషలిస్టు పార్టీ ఎల్బీనగర్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం మహాజన సోషలిస్టు పార్టీ ఎల్బీనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తిన సుధాకర్ మాదిగ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తీగల ప్రదీప్‌గౌడ్ మాట్లాడుతూ, మూడు దశాబ్దాలుగా ఎస్సీ వర్గీకరణ ఉద్యమం చేస్తున్నామన్నారు. ఆగస్టు రెండో వారంలో నిర్వహించే మాదిగల మరో విశ్వరూప మహాసభ రంగారెడ్డి జిల్లా ప్రాంతంలో జరగవచ్చని తెలిపారు. ఎల్బీనగర్ నియోజకవర్గం నుంచి మహాసభకు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మహాజన సోషలిస్ట్ పార్టీ ఎల్బీనగర్ నియోజకవర్గం కార్యదర్శి ప్రకాష్ మాదిగ, డివిజన్ నాయకులు శేఖర్, రాజు, రవి, బస్తీ నాయకులు మౌలాలి మాదిగ, పెద్ద హుస్సేన్ మాదిగ, కృపారాజు మాదిగ,నాగరాజు, అశోక్, కిరణ్ ,నాగరాజు, ఎల్లయ్య, పెంటయ్య ,ఏలియా ఆదామ్ వెంకటేష్, ధనరాజు, రాము, రవి పాల్గొన్నారు

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి: స్థితప్రజ్ఞ


ఎల్బీనగర్‌లో పాత పెన్షన్ సాధన సంకల్ప రథయాత్ర నేతలు

మన్సూరాబాద్: ఉద్యోగుల మెడకు ఉరితాడుగా మారిన సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయీస్ యూనియన్ (టీఎస్‌సీపీఎస్ఈయూ)రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ డిమాండ్ చేశారు. అభి నహీతో కభీ నహీ అనే నినాదంతో ఈ నెల 16న జోగులాంబ జిల్లా గద్వాల్‌లో ప్రారంభమైన పాత పెన్షన్ సాధన సంకల్ప రథయాత్ర ఆదివారం ఎల్బీనగర్‌కు చేరుకుంది. ఎల్బీనగర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూల మాల వేసి నివాళులర్పించి యాదాద్రికి తరలివెళ్లారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ మాట్లాడుతూ, ఉద్యోగుల భవిష్యత్‌ను పారిశ్రామికవేత్తలకు, పెట్టుబడిదారులకు తాకట్టు పెట్టే విధంగా ఉన్న కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం (సీపీఎస్)ను అంతమొందించాలనే రథయాత్ర చేపట్టామన్నారు. యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎస్. నరేందర్‌రావు, కొటకొండ పవన్, శ్యాంసుందర్, అశోక్‌రెడ్డి, మహేందర్, సుధాకర్, అరవింద్, ప్రసాద్ పాల్గొన్నారు.

ఆలిండియా హ్యాండ్లూమ్, హ్యాండీక్రాఫ్ట్ మేళాకు విశేష ఆదరణ

వనస్థలిపురం: వనస్థలిపురంలోని హుడా ఓపెన్ ఆడిటోరియంలో గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఆలిండియా హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీక్రాఫ్ట్ మేళా స్థానికుల ఆదరణ చూరగొంటోంది. మేళాలో కొలువైన దుస్తులు, ఇతర ఉత్పత్తుల కొనుగోలుకు స్థానికులు ఆసక్తి చూపుతున్నారు. మేళాలో మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భగల్పూర్, డిజైనర్, కాంతావర్క్, హ్యాండ్ బ్లాక్ ప్రింటెడ్, లినెన్, కలంకారి, బెంగాల్ కాటన్, లక్నో చికాన్, బనారస్ చీరలు, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ బ్లౌజెస్, ఖాదీ మెటీరియల్, వన్‌గ్రామ్ గోల్డ్ జ్యువెలరీ, జైపూర్ బెడ్‌షీట్స్, కొండపల్లి బొమ్మలు, హైదరాబాద్ ముత్యాలు, బ్యాగులు, చెప్పులు తదితర ఉత్పత్తులు తగ్గింపు ధరలకు లభిస్తాయని నిర్వాహకులు అక్బర్ అలీ తెలిపారు. కొన్ని రోజులు మాత్రమే మేళా ఉంటుందని ఆయన చెప్పారు.


మేళాలో కొనుగోలుదారుల సందడి

సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక బోనాలు


ఖిల్లా మైసమ్మ ఆలయ బోనాల్లో పాల్గొన్న మంత్రి సబితా ఇంద్రారెడ్డి తదితరులు


పాల్గొన్న యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్‌రెడ్డి, పున్న గణేష్

దిల్‌సుఖ్‌నగర్: సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక బోనాల పండుగ అని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ఆదివారం ఆర్‌కేపురం డివిజన్‌లోని ఖిల్లా మైసమ్మ ఆలయంలో నిర్వహించిన బోనాల ఉత్సవానికి మంత్రి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి ముదుకుంట్ల అరవింద్ శర్మ, షాబాద్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నెంటూరి రవీందర్ రెడ్డి, గొడుగు శ్రీనివాస్, న్యాల కొండ శ్రీనివాస్ రెడ్డి, రామాచారి ముప్పిడి లింగస్వామి గౌడ్, కొండ్ర శ్రీనివాస్, శ్రీమన్నారాయణ, వెంకటేష్ గౌడ్ ,పెంబర్తి శ్రీనివాస్, రమేష్, నియోజకవర్గ మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ పటేల్ సునీత రెడ్డి, డివిజన్ అధ్యక్షురాలు ఊర్మిల రెడ్డి, పుష్పలత రెడ్డి, స్వప్న రెడ్డి పాల్గొన్నారు.

ఆఫీసర్స్ కాలనీలో...

ఎల్బీనగర్: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లోని ఆఫీసర్స్ కాలనీలో రేణుక ఎల్లమ్మ బోనాల ఉత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి, మాజీ కార్పొరేటర్ ముద్దగౌని లక్ష్మీ ప్రసన్నగౌడ్, బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చైర్మన్ గంగం ప్రేమ్‌నాథ్, కాలనీ అధ్యక్షుడు బాలాజీ, నాయకులు ముత్యాలు, రాజేందర్, పవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి


పాల్గొన్న సామ రంగారెడ్డి, కార్పొరేటర్ లచ్చిరెడ్డి


పాల్గొన్న మాజీ కార్పొరేటర్ లక్ష్మీ ప్రసన్నగౌడ్

సమస్యల పరిష్కారానికి కృషి


బాలాజీనగర్, పద్మావతినగర్‌ల మధ్య డ్రైనేజీని పరిశీలిస్తున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: డివిజన్‌లోని సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నానని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని పద్మావతినగర్, బాలాజీనగర్‌కాలనీల మధ్య పొంగిపొర్లుతున్న డ్రైనేజీని ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా డ్రైనేజీ పొంగుతుండటంతో డ్రైనేజీ పైప్‌లైన్లను ఆధునీకరించామన్నారు. సబ్ రోడ్ డ్రైనేజీ పైప్‌లెవల్స్ కలువకపోవడంతో మళ్లీ ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు మహేంద్రనాథ్, దశరథ్, సత్తిరెడ్డి, వీరేషం, రాజేంద్రప్రసాద్, మల్లీశ్వరి, రఘునాథ్‌రెడ్డి, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

మన్సూరాబాద్: రాధాస్వామి సత్సంగ్ సంస్థ ఆధ్వర్యంలో మన్సూరాబాద్‌లోని సంస్థ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ వైద్య శిబిరంలో జనరల్ ఫిజిషియన్, గైనకాలజీ, చిల్డ్రన్స్ స్పెషలిస్ట్, కంటి వైద్యులు, దంత వైద్యులు హాజరై పరీక్షలు చేసి సలహాలు అందజేశారు. అవసరమైన వారికి మందులు, కంటి అద్దాలు ఉచితంగా అందజేశారు. రక్త పరీక్షలు, బీపీ, ఈసీజీ తదితర పరీక్షలు ఉచితంగా నిర్వహించారు.సంస్థ నిర్వాహకులు ఎస్వీరెడ్డి, ఎస్. రవీంద్రనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రజకులకు రూ.లక్ష ఆర్థిక సాయం అందజేయాలి

నాగోలు: ఎల్బీనగర్ నియోజకవర్గంలో ఉన్న అర్హులైన రజకులందరికీ ప్రభుత్వం అందజేసే లక్ష రూపాయల ఆర్థిక సాయం అందించాలని తెలంగాణ గాడ్గే రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెద్దవూరే బ్రహ్మయ్య ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని కోరారు. సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎల్బీనగర్ నియోజవర్గంలో రజక భవనం ఏర్పాటు చేయాలని, అందుకోసం స్థలం కేటాయించి నిధులు మంజూరు చేయాలని కోరారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ధోబీ పోస్టుల భర్తీకి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వడ్లాల మడేల్, చంద్రశేఖర్, కంచల్ల నిరంజన్, వెంకటేష్, లక్ష్మణ్, రాహుల్, వెంకటయ్య, నగేష్, తిరుపతి, శ్రీనివాస్, సతీష్ పాల్గొన్నారు.

బంజారాల సంస్కృతికి తీజ్ పండుగ ప్రతీక

సైదాబాద్: తీజ్ పండుగ బంజారాల సంస్కృతికి ప్రతీకగా నిలుస్తుందని ఐఎస్‌సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం డివిజన్ పరిధిలోని నీలం సంజీవరెడ్డి నగర్‌లో నిర్వహించిన తీజ్ వేడుకల్లో కార్పొరేటర్ పాల్గొన్నారు. బస్తీలోని జగదాంబ తల్లి ఆలయంలో ఆమె ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, తీజ్ వేడుకలు బంజారాల్లోని ఐక్యతను తెలుపుతుందన్నారు. వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్‌ను బస్తీవాసులు శాలువాతో సన్మానించారు. బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి, అజయ్‌రెడ్డి పాల్గొన్నారు.

బీసీల జీవన ప్రమాణాల పెంపునకు సీఎం కృషి


కార్యక్రమంలో మాట్లాడుతున్న చైర్మన్ జూలూరు గౌరీశంకర్

సాక్షి, సిటీబ్యూరో: బీసీల జీవన ప్రమాణాలు పెంచేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి చేస్తున్నారని తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ అన్నారు. విశ్వకర్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎల్బీనగర్ లోని భాగ్యనగర్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విశ్వకర్మల వివాహ పరిచయ వేదికకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గౌరీశంకర్ మాట్లాడుతూ, సమాజంలో సగానికి పైగా ఉన్న బీసీల జీవితాల్లో వెలుగులు నింపితేనే రాష్ట్రాభివృద్ధి వేగవంతంగా జరుగుతుందన్నారు. ఈ నేపథ్యంలోనే "సంపద పెంచాలి-సంపద పంచాలి" అన్న లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. చేతివృత్తులను ఆధునీకరించుకోగలిగితే పోటీ ప్రపంచంలో నిలబడటమేగాకుండా ఉత్పత్తి రంగాన్ని కూడా అభివృద్ధి చేసుకోవచ్చనే తలంపుతోనే కేసీఆర్ బీసీలకు లక్షరూపాయలు అందించే పథకాన్ని చేపట్టారన్నారు. ఈ పథకం నిరంతరంగా కొనసాగుతుందన్నారు. చేతివృత్తుల వారికి అందించే ఈ సాయం వల్ల బీసీల జీవనప్రమాణాలు పెరిగే అవకాశం ఉందన్నారు. విశ్వకర్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు అడ్లూరి రవీంద్రాచారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ విశ్వకర్మ, విశ్వబ్రాహ్మణ సంఘం ప్రధాన కార్యదర్శి దువ్వూరి నరసింహాచారి, తెలంగాణ రాష్ట్ర ఆత్మగౌరవ భవనం ట్రెజరర్ రవీంద్రాచారి, అప్పగిరి చెలిమోజు, సీఏ మాధవరావు తదితరులు పాల్గొన్నారు. విశ్వకర్మల అభ్యున్నతి కోసం నిరంతరం శ్రమిస్తున్న ఫెడరేషన్ అధ్యక్షుడు రవీంద్రాచారి దంపతులను జూలూరు ఈ సందర్భంగా సన్మానించారు.

ఆర్యవైశ్యుల సేవా కార్యక్రమాలు అభినందనీయం


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

లింగోజిగూడ: ఆర్యవైశ్యులు సేవా కార్యక్రమాల్లో ముందుంటారని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కర్మన్‌ఘాట్ లక్ష్మీ కన్వెన్షన్ హాల్‌లో విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ, ఆర్యవైశ్యులు వ్యాపారాలకే పరిమితం కాకుండా పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులను ఆదుకోవడం, యువకుల అభివృద్ధికి కృషి చేయడం అభినందనీయమన్నారు. వచ్చే జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో నియోజకవర్గంలో డివిజన్లు పెరిగే అవకాశం ఉందని, వాటిలో వైశ్యులకు అవకాశం కలిపిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దయానంద్ గుప్తా, ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ, మాజీ కార్పొరేటర్ ముద్రబోయిన శ్రీనివాస్‌రావు, నాయకులు చింతల రవికుమార్‌గుప్తా, గణేష్ గుప్తా, వెంకటేశం, కిరణ్‌కుమార్ గుప్తా, సురేష్, రమేష్, రమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రజాస్వామ్యాన్ని రక్షించండి... మణిపూర్‌ను కాపాడండి'

మన్సూరాబాద్: 'ప్రజాస్వామ్యాన్ని రక్షించండి... మణిపూర్‌ను కాపాడండి' అంటూ ఎల్బీనగర్ నియోజకవర్గ పాస్టర్స్, క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.దేవానంద్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేవీఎస్ జాకబ్ అన్నారు. ఎల్బీనగర్ పాస్టర్, క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎల్బీనగర్‌లోని రాక్‌టౌన్ కాలనీ ఎంట్రన్స్ నుంచి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాల వరకు ఆదివారం శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జాకబ్ మాట్లాడుతూ, మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూపుమాపాలని కోరారు. మణిపూర్‌లో దాడులకు పాల్పడుతున్న దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నేతలు బీవీ ప్రసాద్, సాల్మన్‌రాజు, టైటస్, సన్నీ, సురేష్, కృపావరం, ఆనంద్, పరమేశ్వర్‌రెడ్డి, యేసుపాదం, జాన్ తదితరులు పాల్గొన్నారు.

క్రిస్టియన్లపై దాడులను ఖండించాలి

దిల్‌సుఖ్‌నగర్: మణిపూర్‌లో మహిళలు, క్రిస్టియన్లపై జరుగుతున్న దాడులను ఖండించాలని ఆర్‌కేపురం డివిజన్ పాస్టర్ ఫెలోషిప్, ఎన్టీఆర్‌నగర్ క్రిస్టియన్ యూత్ అసోసియేషన్ సభ్యులు కోరారు. మణిపూర్ జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా ఆదివారం ఆయా అసోసియేషన్ల ఆధ్వర్యంలో ఎన్టీఆర్‌నగర్‌లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌కేపురం డివిజన్ పాస్టర్ ఫెలోషిప్ అధ్యక్షుడు జాన్, ప్రధాన కార్యదర్శి జైరాజ్ పాస్టర్, ఎన్టీఆర్‌నగర్ క్రిస్టియన్ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రవీణ్, ఉపాధ్యక్షుడు రమేష్‌కుమార్, కార్యదర్శి వినోద్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం, మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వం మహిళలు, క్రిస్టియన్లపై జరుగుతున్న దాడులను అడ్డుకోవాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో పాస్టర్స్ అమృత, సామ్సన్, సంజీవ్‌కుమార్, పాపయ్య, పాపారావు, కుమార్, యేసయ్య, మారుతి, సుదర్శన్, ఆనంద్, రామ్సన్, దిలీప్, సాల్మన్‌రాజు పాల్గొన్నారు.


ఎల్బీనగర్ పాస్టర్స్, క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ